
దేవరకద్రలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


ఈద్గా వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు


రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ జానకి

ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శాంతి సందేశాలిచ్చిన మతపెద్దలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు
- ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన నేతలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలో ముస్లింలు రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

■ మహబూబ్‌నగర్ పట్టణంలో పేదలు, ధనవంతుల తారతమ్యం లేకుండా తమ స్థాయికి తగిన రీతిలో కొత్త బట్టలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాత పాలమూరులోని మోమిన్ వాడీ నుంచి ముస్లింలు ఊరేగింపుగా బయలుదేరి రహేమానియా ఈద్గా వద్దకు చేరి ప్రార్థనలు చేశారు. కార్పొరేషన్ పరిధిలోని ఏనుగొండ, ఎదిర, అప్పన్నపల్లి, దివిటిపల్లి గ్రామాల్లో ఈదుల్ ఫితర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

■ దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ముస్లింలు ఊరేగింపుగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముస్లింలతో పాటు ప్రార్థనల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రదీప్‌కుమార్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. కౌకుంట్లలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థన చేశారు.

■ జడ్చర్లలో బాదేపల్లి పాతబజార్ ఈద్గా, జడ్చర్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఈద్గా, కావేరమ్మపేట మదర్సాతో పాటు నసురుల్లాబాద్, గంగాపురం, ఉదండాపురం, లింగంపేట గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాదేపల్లి ఈద్గా వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



■ హన్వాడ మండల కేంద్రంతో పాటు చిన్నదర్పల్లి, కొత్తపేట, గొండ్యాల్, వేపూర్ గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

■ నవాబుపేట మండలం కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, కొల్లూర్, రంగంపల్లి, కాకర్‌జాల్, చౌడూర్‌లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

■ మిడ్జిల్, వాడ్యాల్, రాణిపేట్, గ్రామాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

■ చిన్నచింతకుంట, పెద్దవడ్డేమాన్, లాల్‌కోట, బండ్రపల్లి, ఉంద్యాల, దమగ్నాపురం, అప్పంపల్లి గ్రామాల్లో ఈద్గాల వద్ద మతపెద్దలు సందేశం వినిపించారు.

■ మహమ్మదాబాద్, నంచర్ల, షేక్‌పల్లి, చౌదర్‌పల్లి, కంచన్‌పల్లి గ్రామాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు.

■ అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాలు, కందూర్, పొన్నకల్, రాచాల, శాఖాపూర్, కన్మనూర్, జానంపేట, పోల్కంపల్లి, తిమ్మాపూర్, చక్రాపూర్ గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

■ రాజాపూర్, చొక్కంపేట్, తిర్మలాపూర్, ఈద్గాన్‌పల్లి రంగారెడ్డిగూడ, ఖానాపూర్ గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మిడ్జిల్‌లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


దేవరకద్ర ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బాదేపల్లి ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఎదిర ఈద్గాలో సందేశం ఇస్తున్న హాఫిజ్ ఫేరోజ్ నక్షబంది


కౌకుంట్లలో జరిగిన రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


చిన్నచింతకుంటలో..


మూసాపేట ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వైభవంగా వరదరాజులస్వామి రథోత్సవం


రథోత్సవంపై స్వామివారు

కోడూర్‌లో వరదరాజులస్వామి రథోత్సవం లాగుతున్న భక్తులు

- ఘనంగా బిందెసేవ.. ఎద్దుల బండ్ల ఊరేగింపు
- భక్తి పారవశ్యంతో పులకించిన కోడూర్

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రాలలో ఒకటైన కాంచీపురంలో వెలసిన వరదరాజులస్వామి సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం చోళుల రాజధాని అయిన ప్రస్తుత కోడూర్‌లో ప్రతిష్ఠితమయ్యారు. ఆనాటి నుంచి ఆనవాయితీగా ఉగాది పర్వదినం రోజు గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా వరదరాజులస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు వరదరాజులస్వామి దేవాలయంలో ఆదివారం ఉత్సవాలు ప్రారంభించారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

కోడూర్‌లో వెలసిన వరదరాజుల స్వామివారి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలతో ప్రధాన ద్వారం గుండా దేవస్థానం ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ రకాల పూలు, విద్యుత్ బల్బులు, మామిడి తోరణాలతో ముస్తాబు చేసిన రథంపై స్వామివారిని ఉంచి రథోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అడుగడుగునా దైవనామాన్ని స్మరిస్తూ భక్తులు స్వామివారి రథాన్ని సాంప్రదాయ రీతిలో గ్రామ శివారు వద్దకు తీసుకెళ్లి మళ్లీ వెనక్కి తీసుకొచ్చారు. కాగడాలు, విద్యుత్ బల్బుల వెలుతురులో మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం బిందెసేవ నిర్వహించారు. ఉగాది పర్వదినం మరుసటి రోజు హోలీ పండుగను గ్రామస్తులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఆటలు ఆడుకున్నారు. ప్రతి ఏటా హోలీ రోజు కాకుండా వరదరాజులస్వామి ఉత్సవాలలో హోలీ పండుగ ప్రజలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం స్వామివారి దేవాలయం చుట్టూ ఎద్దుల బండ్ల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామస్వామి, మన్యంకొండ పాలక మండలి డైరెక్టర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


వరదరాజులస్వామి ఉత్సవాలలో హోలీ ఆడుతున్న యువకులు

అంగరంగ వైభవంగా కలశాల ప్రతిష్ఠ

దేవరకద్ర: మండల కేంద్రంలో వందల సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాలపై కలశాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవగ్రహ, నాగదేవత విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులుగా పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనలో దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు కొండ ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రఘువీర్‌వర్మ, ఆదిహన్మంతరెడ్డి, జవహర్, రాంపాండు, శ్రీకాంత్‌యాదవ్, శివానంద్, వెంకటేశ్, దేవన్న, కేవీ రాజు, సుధాకర్‌రెడ్డి, తిప్పారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

కలశాలను ప్రతిష్ఠించిన ఎమ్మెల్యే

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు కలశ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. హోమంలో పాల్గొని కలశాలతో దేవాలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గాలి గోపురంపైకి ఎక్కి కలశాలను ప్రతిష్ఠించారు. దేవస్థాన కమిటీ వారు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, గ్రామ నాయకులు, దాతలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.


దేవరకద్రలో ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాలు

క్లుప్తంగా

ప్రొటోకాల్‌పై బీఆర్‌ఎస్ నాయకుల ఆవేదన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో సోమవారం రహెమానియా ఈద్గా వద్ద ప్రొటోకాల్‌పై బీఆర్‌ఎస్ నాయకులు కొంత ఆవేదన వ్యక్తం చేశారు. ఈద్గా ఆవరణలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలపడానికి వేదిక ఏర్పాటు చేశారు. వేదికపైన కుర్చీలలో ప్రముఖుల పేరుతో వేశారు. అయితే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేరు విషయంలో ప్రొటోకాల్ పాటించలేదని బీఆర్‌ఎస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. వేదిక పక్కనే మాజీ మంత్రి, ఇతర బీఆర్‌ఎస్ నాయకులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.25వేలు



మిడ్జిల్: మండల కేంద్రంలోని వాడిక వేంకటేశ్వరస్వామి హుండీని సోమవారం లెక్కించగా రూ.25,678 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలల హుండీని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమం లో గ్రామపెద్దలు రాజేశ్వర్, బంగారు, తిరుపతి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ కూతురు డిప్యూటీ కలెక్టర్



నారాయణపేట రూరల్: ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి కూతురు గ్రూప్–1 పరీక్షల్లో సత్తా చాటి డిప్యూటీ కలెక్టర్‌కు ఎంపికై ంది. పట్టణంలోని కుర్వగేరికి చెందిన సల్ల శ్రీనివాస్, వసంధరల కుమార్తె వీణ ఇటీవల విడుదలైన ఫలితాల్లో 484.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 118వ ర్యాంకు, మల్టీజోన్– 2లో మూడో ర్యాంకు సాధించింది. మహిళా కేటగిరిలో రెండో స్థానంలో ఉండటంతో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యే అవకాశం ఉందని వీణ పేర్కొంది. ప్రస్తుతం వీణ గోల్కొండలోని బీజేఆర్ మహిళా కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుంది. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పరీక్షలకు సంసిద్ధమైనట్లు వీణ పేర్కొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్


పైప్‌లైన్ పగిలి వ్యవసాయ పొలాల్లో వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీరు

రాజాపూర్: మండలంలోని రాయపల్లి గ్రామానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ తరచూ పగులుతుండటంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడక తప్పడంలేదు. సోమవారం ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి పక్క రాయపల్లి గ్రామానికి నీటి సరఫరా అయ్యే పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరా అధికారులకు ఫిర్యాదు చేసి గ్రామ కారోబార్ నర్సింహులు పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించారు. జాతీయ రహదారి పక్కన మట్టిరోడ్డుపై సమీపంలోని సేజ్‌లోకి భారీ వాహనాలు పైప్ లైన్‌పై నుంచి వెళ్లడంతో తరచూ పైప్‌లైన్ పగిలిపోతోందని అధికారులు చెబుతున్నారు. పైప్‌లైన్ పగిలినప్పుడు రెండు మూడు రోజులు తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కారం చేసి పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'సామాజిక సమానత్వమే ముఖ్యం'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సామాజిక సమానత్వం, న్యాయం కోసం పోరాడతామని పట్టణ వీరశైవ సమాజం గౌరవాధ్యక్షుడు ముక్తా శ్రీశైలం అన్నారు. సోమవారం టీచర్స్‌కాలనీలోని రామాలయం వద్ద కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభ్యున్నతికి అందరూ కృషి చేయాలన్నారు. అధ్యక్షుడిగా గురుపాదయ్య, ప్రధాన కార్యదర్శిగా బసప్ప, కోశాధికారిగా శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా మధుస్వామి, జంగం శ్రీశైలం, నాగరాజు, కె.జగదీశ్వర్, సిద్దేశ్వర్, బసప్ప ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా వై.జగదీశ్వర్, శంకర్, రాజలింగం, రాజేంద్రప్రసాద్, ముక్తా నగేష్, ప్రవీణ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా కె.రాజలింగం, మల్లేష్‌లతో పాటు మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జరిగే బహుజన మహానీయుల శోభాయాత్ర కరపత్రాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన మహానీయుల శోభాయాత్ర పేరుతో మంచి కార్యక్రమానికి నిర్వాహకులు శ్రీకారం చుట్టారన్నారు. వారి ఆశయాలను ముందు తరాలకు అందించటానికి కృషి చేయాలని సూచించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు ప్రవీణ్ కుమార్, రవికిరణ్, శోభాయాత్ర కమిటీ నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, పాతూరు రమేష్, వినయ్, టి.నవీన్‌కుమార్, శివ పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ జాతర పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: పూలే, అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జాతర వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. పూలే– అంబేడ్కర్ జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్సింహులు, బాలరాజు, వెంకటస్వామి, సామెల్, లక్ష్మణ్, యాదగిరి నాయక్, జంగయ్య, మాసయ్య, ఆది విష్ణువర్ధన్, విద్యావతి, బాబమ్మ, నర్సింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో విజయాలు అందించాలి

మహబూబ్‌నగర్ రూరల్: శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది మనందరికి విజయాలను కీర్తిని అందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కోడూర్‌లో వరదరాజులస్వామి బండ్లు తిరిగే వేడుకకు ఆయన హాజరయ్యారు. అనంతరం గ్రామంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ఆవరణలో వరదరాజులుస్వామి వారి బండ్లు తిరిగే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మండుటెండలో.. చల్లటి కానుగ



నవాబుపేట: వేసవి ఎండలకు తాళలేక చెట్లన్నీ ఎండిపోయి ఆకులు రాలుతుంటే కానుగ మాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి తన ప్రత్యేకతను చాటుకుని చల్లటి గాలినిస్తుంది. వేసవిలో కానుగ చెట్టు నీడ ఎంత హాయినిస్తుందో దానికి పూచిన పూలు సైతం అందానికే అందంలా ప్రత్యేక ఆకారాలు, వర్ణాలతో కనువిందు చేస్తున్నాయి. వేసవిలో కానుగ ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి. అందుకే కానుగ మనకు వేసవి కానుకగానే కనిపిస్తుంది.

అంబలి కేంద్రం ఏర్పాటు అభినందనీయం


అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మరికల్: నాలుగు దశాబ్దాల నుంచి బాటసారుల దాహం తీర్చేందుకు తీలేర్ స్టేజీ వద్ద ప్రతి వేసవిలో అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీలేర్ స్టేజీ వద్ద సోమవారం మాజీ సర్పంచ్‌లు వెంకారెడ్డి, వజ్రమ్మ, మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డిల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి వేసవిలో అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవత్తమ్మ, ప్రదీప్‌గౌడ్, కృష్ణయ్య, అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కుర్మయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

చివరిరోజు 100 దరఖాస్తులు క్లియర్

జడ్చర్ల టౌన్: మార్చి 31 నాటికి ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ చేసుకున్న వారికి 25శాతం రాయితీ కల్పించటంతో లబ్ధిదారుల నుంచి కొంత స్పందన లభించింది. చివరిరోజు సోమవారం సెలవుదినం అయినప్పటికీ మున్సిపాలిటీలో పనులు కొనసాగాయి. చివరిరోజున జడ్చర్ల మున్సిపాలిటీలో మొత్తం 100 మంది లబ్ధిదారులు తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించారు. మున్సిపాలిటీలో మొత్తం 17,642 దరఖాస్తులు రాగా, అందరికి ఎల్‌ఆర్‌ఎస్ సమాచారం అందించారు. ఎన్ని దరఖాస్తులు క్లియర్ అయ్యాయో వివరాలు తెలియాల్సి ఉంది.

దేవాలయాల వద్ద వాష్‌రూంలు నిర్మించాలి

జడ్చర్ల టౌన్: దేవాలయాల వద్ద మహిళలు, పురుషుల కోసం టాయిలెట్స్, వాష్‌రూంలు నిర్మించాలని జడ్చర్ల సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యుడు ఇంజినీర్ నర్సింహులు సోమవారం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రాత్రి నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండపేట దేవాలయం వద్ద జరిగిన యువతిపై లైంగిక దాడి ఘటన అమానుషమని పేర్కొన్నారు. ఘటనకు కారణం సరైన టాయిలెట్ వసతులు లేకపోవటమేనని, అవి ఉంటే యువతి బయటకు వెళ్లాల్సి వచ్చేది కాదని తెలిపారు. అందుకే అన్ని దేవాలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం టాయిలెట్లు, వాష్‌రూంలు నిర్మించాలని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఈ విషయంలో స్పందించి దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడాలని కోరారు. ఆలయాల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలన్నారు.

యువతి అదృశ్యం

నవాబుపేట: యువతి అదృశ్యంమైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన యువతి(19) ఇంటిదగ్గర ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆమె కోసం చాలా చోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన ఎల్లరి నరేష్‌పై అనుమానం ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తన కూతురిని తమకు అప్పగించాలని కోరింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

మీసేవ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

దేవరకద్ర: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కోనరాజశేఖర్, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, రాంపాండు, జవహర్, ఆదిహన్మంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దేవరకద్ర మండలం గూరకొండలో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు కొండారెడ్డి భార్య పండుగ రోజు విద్యుదాఘాతంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సంతాపం తెలిపారు. మాజీ సర్పంచ్ ఉసేనప్ప తల్లి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన పద్మమ్మ అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆమె కుమారుడు మాజీ సర్పంచ్ రంగారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, కొండా జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, లింగారెడ్డి, శకుంతల ఉన్నారు.

మారెమ్మవ్వ జాతర వాల్‌పోస్టర్ విడుదల



మాగనూర్: మండల పరిధిలోని బైరంపల్లిలో ఈనెల 8న నిర్వహించనున్న మారెమ్మవ్వ జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో మారెమ్మవ్వ జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర మహోత్సవానికి కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ లాంటి ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, బైరంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.